క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులకు ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ శనివారం ఆర్థికసాయం అందజేశారు. 30 మంది వినాయక మండప నిర్వాహకులకు రూ.10 వేల చొప్పున అందజేశారు. వినాయక చవితిని ప్రజలు కలసిమెలసి ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఐచర్ సీజ్

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో శనివారం రవాణా శాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేకపోవడంతో ఐచర్ వాహనాన్ని సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. రూ.54 వేలు జరిమానా విధించినట్లు ఎంవీఐ రమణ తెలిపారు.

రూ.147 కోట్లతో అభివృద్ధి పనులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కర్ణాటక హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర

పావగడ: పావగడ తాలుకాలో రూ.147 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కర్ణాటక రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర తెలిపారు. శనివారం తాలుకాలోని వెంకటమనహళ్ళి గ్రామంలో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. పట్టణంలోని గురుభవన్ మైదానంలో జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడారు. పావగడ తాలుకా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజలు కూడా అభివృద్ధి పనులకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల సవరణ దుర్మార్గం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

పెనుకొండ: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సంపన్న వర్గాలకు దారాధాత్తం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సీఐటీయూ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలకు సవరణ చేస్తూ అంబానీ, అదానీ లాంటి సంపన్న వర్గాలకు ప్రయోజనం చేకూర్చుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్నారు. 8 గంటల పని సమయాన్ని 12 గంటలకు పెంచేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. కార్మిక విధానాల బలోపేతం, కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రమేష్, సాంబ, నరసింహులు, శ్రీదేవి, లక్ష్మీనారాయణ, బాబా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

హిందూపురం: రక్తదానం మహాదానమని ఆపదలో ఉన్న వారిని రక్తదానంతో ఆదుకోవచ్చునని విప్రో ఎంటర్‌ప్రైజెస్ సిలిండర్ ప్లాంట్ హెడ్ మాచయ్య, జగదీశ్వరరావు అన్నారు. వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా కుశాల్ హెల్త్‌కేర్ క్లినిక్, సత్యసాయి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం జరిగింది. విప్రో పవర్‌గేర్, రోడియం, టిక్స్‌పోర్టు యూనిట్ సిబ్బంది వలంటీర్లు సుమారు వందమంది దాకా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఈడీ విజయకుమార్, హెచ్‌ఆర్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, డాక్టర్ చక్రతేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



విత్తనాలు నాటుతున్న దృశ్యం

పరిగి: మండలంలోని గొరవనహళ్లిలో శనివారం ప్రకృతి సేద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌బీఎన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతు శ్రీకంఠ పొలంలో 5 రకాల చిరుధాన్యాల సాగును ప్రారంభించారు. సేంద్రియ వ్యవసాయంతో మంచి పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాల దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంసీఏలు తిప్పమ్మ, ఈశ్వరమ్మ, సీఆర్‌పీఎస్‌లు రాజేశ్వరీ, లలితమ్మ, నవీన్, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు జైలు శిక్ష తప్పదు

- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక



హిందూపురం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రధాన సూత్రధారి టీడీపీ అధినేత చంద్రబాబును అన్ని ఆధారాలతో సీఐడీ అధికారులు అరెస్టు చేశారని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో స్పష్టమైన ఆధారాలతోనే చంద్రబాబును నంద్యాలలో సీఐడీ అరెస్ట్ చేశారన్నారు. ఇది రాత్రికి రాత్రే జరిగింది కాదన్నారు. అసలు విషయం చెప్పకుండా టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబు ప్రజల కళ్లు గప్పి అసలు విషయాన్ని దాచేశారన్నారు. డిజైన్ టెక్ కంపెనీకి మళ్లించిన రూ.371 కోట్లు వివిధ షెల్ కంపెనీల ద్వారా తిరిగి చంద్రబాబుకు చేరాయని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. సీమెన్స్ పేరు వాడుకుని చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ కుంభకోణ సృష్టికర్త చంద్రబాబే అని సీబీఐ విచారణలో తేలిందన్నారు. అసలు లేని ప్రాజెక్ట్‌ను ఉన్నట్టుగా సృష్టించారని వెల్లడించారు. చంద్రబాబుకు తాను అరెస్ట్ అవుతానని ముందే తెలుసున్నారు. అరెస్టు అన్యాయం, దారుణం నోటీసులు లేవని సానుభూతి కోసం పాకులాడారని విమర్శించారు. అన్ని ఆధారాలు పరిశీలించిన తర్వాతనే సీఐడీ అధికారులు అరెస్టు చేశారన్నారు.

టీడీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపులతో తనను అరెస్ట్ చేస్తున్నారని చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ బూకాయిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అవినీతి జరగలేదని చంద్రబాబు నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, తదితరులు

పెనుకొండ: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును పక్కా ఆధారాలతోనే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ తదితరులు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. స్కాంలో ప్రభుత్వ సొమ్ము రూ. 371 కోట్లు అవినీతి జరిగిందన్నారు. ఇందులో ప్రధాన సూత్రధారి చంద్రబాబే అని ఆరోపించారు. కేబినెట్‌ను సైతం చంద్రబాబు తప్పుదారి పట్టించి, డబ్బులు కాజేశారన్నారు. జీఎస్టీ, ఈడీ, ఇంటలిజెన్స్, సెబీ ఐటీ సంస్థలు సైతం దీనిపై దర్యాప్తు చేసినట్లు వెల్లడించారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల్లోనే ఈ స్కాంకు పాల్పడ్డారన్నారు. తమకు తాము తయారు చేసుకున్న అంచనా వ్యయాన్నే డీపీఆర్‌గా చూపిస్తూ రూ.3,356 కోట్ల ప్రాజెక్ట్ పేరుతో ప్రభుత్వం 10 శాతం వాటా భరించాలని అవినీతికి తెరలేపారన్నారు. అప్పటి ప్రభుత్వ స్థాయిలోని సెక్రటరీ, ఆపై స్థాయి అధికారులను ఓవర్ రూల్ చేస్తూ కేబినెట్‌లోకి స్పెషల్ ఐటంగా నోట్ తీసుకొచ్చారని తెలిపారు. వెంటనే ఓకే చేసి జీఓ విడుదల చేయడం అన్నీ ఆఘమేఘాల మీద జరిగిపోయాయన్నారు. ఆర్థిక శాఖపై ఒత్తిడి తెచ్చారంటూ అప్పటి ఫైనాన్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఏకంగా ఈ విషయాన్ని తన నోట్ ఫైల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. సీమెన్స్ ప్రతినిధులు సైతం ఈ వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధం లేదని కోర్టుకు తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘ విచారణ చేపట్టిన సీఐడీ చంద్రబాబు అవినీతిని బట్టబయలు చేసిందని తెలిపారు. చంద్రబాబుకు జైలు శిక్ష తప్పదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, ముఖ్య నాయకులు యాసిన్, బోయబాబు, శ్రీరాములు, కిష్టప్ప పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



హిందూపురం అర్బన్: ఇరువర్గాలను రాజీ చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం పొందవచ్చని అదనపు జిల్లా జెడ్జి శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 252 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. ఇందులో 36 ఐపీసీ, 33 ఎక్సైజ్, 33 పీఎల్‌సీ, ఇసుక అక్రమ రవాణా, చెక్‌బౌన్స్, మెయిన్‌టెనెన్స్, ప్రమాదబీమా తదితర కేసులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం కక్షిదారులకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఏపీపీలు నగేష్, సుహాసిని, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు సిద్దూ, కళావతి, పార్వతి, హేమావతి, శారద, రత్నమ్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

159 కేసుల పరిష్కారం

మడకశిర: మడకశిరలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో 153 కేసులను పరిష్కరించి, రూ.1.09 లక్షల అపరాధ రుసుం విధించారు. 5 బ్యాంక్ కేసులు పరిష్కరించి, రూ.1,46,500 చెల్లించేలా తీర్పు వెల్లడించారు. అలాగే రూ.16 లక్షలతో ఒక ఎంసీ కేసు పరిష్కరించారు.

ప్రశాంతంగా జీవించాలి

పెనుకొండ: కేసుల రాజీతో ప్రశాంతంగా జీవించాలని న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు కేసులను రాజీ చేసుకుని ప్రశాంతంగా జీవించాలన్నారు. 216 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ భాస్కరరెడ్డి, ఏపీపీ నాగేశ్వరి, న్యాయవాదులు అసిఫ్, నాగార్జున, దయానందరెడ్డి, మోహన్‌నాయక్, శ్రీనివాసులు, రాజేష్‌నాయక్, అబూబకర్, విశ్వనాథ్ నాయక్, విక్రాంత్‌నాయక్, శ్రీరాములు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



గౌడనహళ్లిలో లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి లక్ష్మీ నరసింహస్వామి, పెనుకొండ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం సాయంత్రం టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ.. టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. శ్రీవారికి సేవ చేసే భాగ్యం కల్పించడం గొప్ప విషయమన్నారు. మడకశిర అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తునన్నారు. అన్ని చెరువులకు కృష్ణాజలాలు నింపి ఆయుకట్టు భూములను సాగులోకి తీసుకోస్తామన్నారు. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సర్పంచ్ పుట్టమ్మ, నాయకులు సత్యనారాయణ రెడ్డి, జమ్మానిపల్లి మూర్తి, హనుమంతరాయప్ప, నర్సేగౌడు, జయరాజ్, నరసింహ పాల్గొన్నారు.

కమనీయం.. వేణు గోపాలుడి రథోత్సవం



అమరాపురంలో రథాన్ని లాగుతున్న భక్తులు



తమ్మడేపల్లిలో శ్రీకృష్ణుడి చిత్రపటం ఊరేగింపు

అమరాపురం: మండలంలో శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని భక్తులు శనివారం వేణుగోపాల స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరాపురంలోని దక్షిణ గొల్లహట్టిలో అర్చకుడు నరసింహభట్టాచార్యులు.. వేణుగోపాల స్వామికి వివిధ రకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చిన అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. రథంలో ఊరేగుతున్న స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే మండలంలోని తమ్మడేపల్లిలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు ఇప్పించాలి



పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపికకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

హిందూపురం: తమ పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు ఇప్పించి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపికను తూమకుంట పారిశ్రామికవాడలోని గురునానక్ ఫార్మా కంపెనీ కార్మికులు కోరారు. శనివారం వారు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. పారిశ్రామిక అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని దీపిక హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంపెనీ కార్మికులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీరాంరెడ్డి, తిప్పేరుద్రయ్య, చాంద్‌బాషా, వెంకటేష్ రెడ్డి, రాజారెడ్డి, దేవరాజు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ముబారక్, రమేష్, రామచంద్రా తదితరులు పాల్గొన్నారు. హిందూపురం అర్బన్: తూమకుంట పారిశ్రామిక వాడలో గురునానక్ కర్మాగారం ఎదుట కార్మికులు చేపడుతున్న నిరసనకు శనివారం ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాది రవికుమార్ మద్దతు తెలిపారు. కార్మికుల హక్కులను యాజమాన్యం హరించి శ్రమ దోపిడీకి గురి చేసిందన్నారు. కార్మిక శాఖ అధికారులు స్పందించి తక్షణం కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు బాబు, కార్యదర్శి దేవరాజు, కార్మికులు చాంద్‌బాషా, చంద్రశేఖర్, సతీష్, శ్రీనివాసులు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం

హిందూపురం టౌన్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక మండపాల నిర్వాహకులతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు గణేష్ ఉత్సవ సమితి నాయకులు శనివారం తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే మండప నిర్వాహకులతో చర్చిస్తామన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

హిందూపురం: ఏపీటీఎఫ్ పట్టణ, లేపాక్షి మండల కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. హిందూపురం మండల శాఖ అధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శి నారాయణస్వామి, లేపాక్షి మండల అధ్యక్షుడిగా రామలింగయ్య, ప్రధానకార్యదర్శిగా ఫణికుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంజనమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ రవిశేఖర్, రాందాస్‌నాయక్, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ గురురాజారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వన్‌టౌన్, అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐల బాధ్యతల స్వీకరణ



అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ వై.శ్రీనివాసులు



వన్‌టౌన్ సీఐ వి.శ్రీనివాసులు

హిందూపురం అర్బన్: అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తానని అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ వై.శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. గంజాయి, మత్తు, కర్ణాటక మద్యం, మట్కా, పేకాట నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం డీఎస్పీ కంజాక్షన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వన్‌టౌన్ సీఐగా వి.శ్రీనివాసులు

హిందూపురం అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వన్‌టౌన్ సీఐ వి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం సీఐ విలేకరులతో మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కర్ణాటక మద్యం తరలిరాకుండా చూస్తామన్నారు. డీఎస్పీ కంజాక్షన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రొళ్ల ఎస్ఐగా సి.మధురామచంద్రుడు



రొళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సి.మధురామచంద్రుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న వెంకటరమణను వీఆర్‌కు పంపించారు. శ్రీసత్యసాయి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వీఆర్‌లో ఉన్న సి.మధురామచంద్రుడును రొళ్ల ఎస్ఐగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సి.మధురామచంద్రుడు మాట్లాడుతూ.. అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణాతో పాటు ఇతరత్రా నిషేధిత వస్తువులు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న తాజ్‌బాబా

పెనుకొండ: విజయవాడలో శనివారం వక్ఫ్‌బోర్డ్ ముతవల్లి ఎన్నిక జరిగింది. పెనుకొండ బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా విజయవాడకు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కంటి ఆపరేషన్లకు 125 మంది ఎంపిక



రోగులకు సూచనలిస్తున్న దృశ్యం

హిందూపురం: కంటి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని డాక్టర్ అన్యూహ్య అన్నారు. శనివారం స్థానిక సీఅండ్ఐజీ మిషన్ చర్చి కాంపౌడ్‌లో ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వారు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. 125 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిని బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించి, హిందూపురానికి తీసుకొస్తామన్నారు. గత నెలలో ఆపరేషన్లు చేయించుకున్న 179 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఅండ్ఐజీ కాంపౌడ్ చర్చి కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి పాల్, డికెన్ బోర్డు సభ్యులు వలంటీర్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. జ్యోతుల ఉత్సవం





పావగడ: అలంకరణలో శనేశ్వర స్వామి | పూజల్లో పెద్ద చెరువుకట్ట ఆంజనేయ స్వామి



గుడిబండ: హెచ్.ఆర్.హట్టి గ్రామంలో..

రొళ్ల/హిందూపురం/మడకశిరరూరల్/పావగడ/పెనుకొండ రూరల్/అమరాపురం/అగళి/గుడిబండ/లేపాక్షి: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని శనేశ్వరుడు, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వేకువజామునే అభిషేకాలు, అంకురార్పణ, నవగ్రహారాధన, కుంకుమార్చన చేపట్టారు. రొళ్ల మండలంలోని టీడీ పల్లి, హెచ్‌ఎం పల్లి, హులికుంట, ఆవినకుంట తదితర గ్రామాల నుంచి మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామి విగ్రహం ఎదుట నల్లటి నువ్వులతో జ్యోతులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. హిందూపురంలోని సూగురు ఆంజనేయస్వామి ఆలయం, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, కౌన్సిలర్ శివ, నారాయణస్వామి తదితరులు పూజలు చేశారు. మడకశిర మండలం భక్తరహళ్ళి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి, పావగడలో శనేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అమరాపురం మండలం ఆలదపల్లిలో శనేశ్వర స్వామికి కలశాలను ఊరేగించారు. గుడిబండ మండలం హళ్లారం, కె.కె.పాళ్యం గ్రామాల్లో ఆంజనేయస్వామికి మహిళలు జ్యోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పెనుకొండ, అగళి, లేపాక్షి మండలాల్లో ఆంజనేయుడికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



రొళ్ల: శనేశ్వర స్వామి ఆలయం చుట్టూ జ్యోతులతో ప్రదక్షిణ



మడకశిరరూరల్: కదిరేపల్లిలో శనేశ్వర స్వామికి జ్యోతుల ఊరేగింపు



లేపాక్షి: ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు



పల్లకీ ఉత్సవానికి హాజరైన నాయకుడు వేణురెడ్డి



అగళి: ఆంజనేయ స్వామికి హారతులు ఊరేగిస్తున్న దృశ్యం



అమరాపురం: ఆలదపల్లిలో హారతులు తీసుకెళ్తున్న మహిళలు